క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కీర్తి,రైల్వే అధికారులు

గజపతినగరం: మండల కేంద్రంలో జాతీయ రహదారి నుంచి స్థానిక రైల్వే స్టేషన్ వరకు రోడ్డు నిర్మాణానికి విజయనగరం ఆర్డీఓ (రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్) దాట్లకీర్తి, రైల్వే అధికారి శరత్ మంగళవారం స్థల పరిశీలన చేశారు.జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్ వరకు సుమారు వంద మీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం స్థలపరిశీలన చేశామని వారు తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సిరిదేవిపురం చెరువులో చేసిన పనులను పరిశీలిస్తున్న ఆడిట్ సిబ్బంది

మెరకముడిదాం: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పను లపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు మంగళవారం తనిఖీలు చేశాయి. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ.10.86 కోట్లతో చేపట్టిన మెటీరియల్ కాంపోనెంట్ వర్క్‌లు, వేతనదారులకు రూ.25.46 కోట్లు వేతనాలు చెల్లించి చేసిన పనులను పరిశీలిస్తున్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



అప్పలనాయుడు (ఫైల్)

మెరకముడిదాం: మండలంలోని రామాయవలస పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. అప్పలనాయుడు గుర్ల మండలంలోని గరికవలసలోని తన స్వగృహంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని చీపురుపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి, పరిస్థితి విషమంగా ఉందని వెంటనే విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించడంతో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని కుటంబ సభ్యులు తెలిపారు. ఈయన ఇటీవలే గుర్ల మండలం నుంచి రామాయవలసకు బదిలీపై వచ్చారు. మృతుడికి భార్య శైలజ, కుమారుడు రామతేజ, కుమార్తె పవిత్ర ఉన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ లలిత

జామి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థినులకు బాలికల, మహిళల రక్షణ చట్టాలు, హక్కులపై స్థానిక సచివాలయ మహిళా పోలీస్ లలిత మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యక రంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ద్వారా పోలీసులకు తెలియజేయాలని బాలికలకు సూచించారు. బాల్య వివా హాలతో కలిగే అనర్థాలను, పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయ అధికారి సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గరివిడి మండల ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు, సీఐటీయూ నాయకులు గరివిడిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా పెన్షనర్లు, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఈపీఎస్–95 పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9వేలు, డీఏ చెల్లించాలని, దేశంలో 75 లక్షల మంది ఈపీఎస్ పెన్షన్‌దారులు ఉన్నారని, వీరిలో 35లక్షల మందికి వెయ్యి రూపాయలలోపు పెన్షన్ వస్తోందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్న పరిస్థితుల్లో ఈపీఎస్ పెన్షనర్ల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అయ్యర్ పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఉచితవైద్యం అందించాలని, రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని డిమాండ్‌చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.గౌరినాయుడు,మండల ఈపీఎస్ పెన్షనర్ల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సలీం, మూర్తి, అప్పలరాజు,సన్యాసినాయుడు,పాపినాయుడు,రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏం కొనేటట్టు లేదు..

- నింగినంటుతున్న నిత్యావసరాల ధరలు
- అమాంతం పెరిగిన ధరలతో సామాన్యుడిపై భారం
- వంట నూనె నుంచి ఉల్లి వరకు భగ్గుమంటున్న ధరలు
- ధరల నియంత్రణలో విఫలమైన కూటమి ప్రభుత్వం



కూరగాయలు



నిత్యావసర సరుకులు

మెరకముడిదాం: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడిని గగ్గోలు పెట్టిస్తున్నాయి. వంట సరుకుల ధరలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అన్న చందంగా తయారైంది. రోజంతా కష్టపడి సంపాదించిన కూలి డబ్బులు తీసుకుని బజారుకు వెళితే జేబు ఖాళీ అవుతుందే తప్ప సంచి నిండడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆపార్టీ నాయకులు ఎన్నికలకు ముందు బాదుడే బాదుడు అంటూ ఊరూరా ప్రచా రం చేశారు. తాము అధికారంలోకి వస్తే ధరలు పెరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు తగ్గించడం మాట పక్కనపెడితే..రోజు రోజుకీ అడ్డూ అదుపు లేకుండా ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందనేందుకు మార్కెట్‌లో ధరలే నిదర్శనం. మొన్నటివరకూ కిలో రూ. 25 నుం చి రూ.30 పలికిన ఉల్లి ధర ఇప్పుడు రూ.70కి చేరింది. వెల్లుల్లి ధర గతేడాది ఇదే నెలలో కిలో రూ.150 నుంచి రూ.200 వరకూ విక్రయించేవారు. ప్రస్తుతం కిలో రూ.410కి చేరింది. వంటనూనెలపై లీటర్‌కు రూ.20 వరకూ పెరిగింది. మొన్నటిదాకా పామాయిల్ ధర రూ.96 కాగా ప్రస్తుతం రూ.120, రిఫైన్డ్ ఆయిల్ రూ.120 నుంచి రూ.140కి, శనగ నూనె రూ.155 నుంచి రూ.170కి చేరింది. రూ.150 ఉండే కందిపప్పు ధర ప్రస్తుతం రూ.170, రూ.180 మధ్యలో ఉంది.గోదుమపిండి రూ.30 నుంచి రూ.50కి, కోడి గుడ్డు రూ.4.50 నుంచి రూ.6.16 వరకూ చేరింది. పిక్కతీసిన చింత పండు కిలో రూ.140, ఎండు మిర్చి కిలో రూ.220 పలుకుతోంది. కూరగాయల ధరలు కూడా ఇదే తీరుగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసరాల ధరలు 30 శాతం వరకూ పెరిగాయి.

గతేడాది నవంబర్ నెలతో పోల్చితే కొన్ని నిత్యావసర సరుకుల ధరల మధ్య వ్యత్యాసం ఇలా..

వస్తువు	2023 ధరలు (కిలో)	2024న ధరలు(కిలో)
వెల్లుల్లి	రూ.190	రూ.410
ఉల్లి	రూ.30	రూ.70
కందిపప్పు	రూ.150	రూ.170/ రూ.180
పెసరపప్పు	రూ.105	రూ.130
మినప పప్పు	రూ.95	రూ.130
రిఫైన్డ్ ఆయిల్	రూ.110	రూ.145
పామాయిల్	రూ.88	రూ.140
ఎండికొబ్బరి	రూ.120	రూ.210
శనగలు	రూ.80	రూ.130

కొనలేకపోతున్నాం..

ఏ వంట చేయాలన్నా ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరి. పెరిగిన ధరల వల్ల వాటిని కొనలేకపోతున్నాం. కిలో.150 నుంచి రూ.200 మధ్య ఉండే వెల్లుల్లి ధరను రూ. 380 నుంచి రూ.410 వరకు పెంచేశారు. వంట నూనె ధరలు కూడా లీటర్‌కి రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగిపోయాయి. కందిపప్పు, పెసర పప్పు, ఇతర వంట దినుసల ధరలను అమాంతం పెంచేశారు. ఇలా అయితే సామాన్యుల పరిస్థితి ఏం కావాలి. ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించాలి.

– కొమ్ము రమ్య,మెరకముడిదాం

పేదలకు కష్టం

అన్ని నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేదలు, మధ్యతరగతి ప్రజల కుటుంబ పోషణ కష్టంగా మారింది. ధరలను అదుపు చేయాల్సిన ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. మాలాంటి సామాన్యుల పరిస్థితి ఏం కొనలేం, ఏం తినలేం అన్నట్లు ఉంది.

– గంట్యాడ రామారావు, ముడిదాంపాలెం, మెరకముడిదాం మండలం

నేడు విశ్రాంత ఉద్యోగుల వనసమారాధన

చీపురుపల్లి: చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కార్తీక వనసమారాధన బుధవారం నిర్వహించనున్న ట్లు ఆసంఘం అధ్యక్షుడు పొట్నూరు సత్యం, ప్రధాన కార్యదర్శి అంపోలు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు సుబుద్ది లక్ష్మణరావు, కోశాధికారి కెల్ల జగన్నాధరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివరాం రోడ్డులో ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా తోటలో వనసమారాధన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈసందర్భంగా 73 ఏళ్లు నిండిన సభ్యులకు సత్కారం చేయడంతో పాటు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. చీపురుపల్లి, గరివిడి మండలాల విశ్రాంత ఉద్యోగులంతా హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శృంగవరపుకోట: స్థానిక గాంధీపార్కు ఆవరణలో దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ గేదెల తిరుపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశం కోసం గరీబీ హఠావో అనే నినాదంతో ముందుకు వెళ్లారన్నారు. దేశభద్రత, రక్షణ కోసం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చింతల ఈశ్వరరావు, ఎల్.కోట మండల అధ్యక్షుడు గురుమోహన్‌రావు, జామి మండల నాయకులు కొత్తలి కృష్ణ, పట్టణ నాయకులు హనుమాలశెట్టి నానాజీ పాల్గొన్నారు.

ఆకతాయి చేష్టలు చేస్తే కఠిన చర్యలు

గజపతినగరం: నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వడం , పట్టాలపై రాళ్లు పేర్చడం వంటి ఆకతాయి చేష్టలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ రైల్వే ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పురిటిపెంట రైల్వే గేటు వద్ద వాహన చోదకులు, ప్రయాణికులకు మంగళవారం అవగాహన కల్పించారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు పట్టాలపై రాళ్లు, దుక్కలు పెడుతున్నారని, మరికొంతమంది సరదా కోసం కాయిన్స్ పెట్టడం వంటివి చేస్తున్నారని, ఇలాంటి చర్యల వల్ల రైలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి పనులు చేయవద్దని సూచించారు. ఇటువంటి పనులు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని, దొరికితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తూ కనిపిస్తే వెంటనే 139 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ డి.జి.రాజు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి వాడుదాం.. ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం



వేపాడ: వేపాడలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ అప్పారావు, తదితరులు



గజపతినగరం: గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధుల మానవహారం

బహిరంగ మలవిసర్జనకు స్వస్తి చెప్పి ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించాలని ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మరుగు దొడ్లను వినియోగించాల్సిన ఆవశ్యకతపై గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆరుబయట మలవిసర్జన చేయడం వల్ల వ్యాధుల బారిన పడతారని, వ్యక్తిగత మరుగు దొడ్లను విని యోగించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించా రు.

– సాక్షి నెట్‌ వర్క్



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయిడు



గంట్యాడ: గంట్యాడలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, జైహిందకుమార్,తదితరులు



లక్కవరపుకోట: మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు



కొత్తవలస: వియ్యంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



మెరకముడిదాం: గర్భాంలో పారిశుద్ధ్యకార్మికుడిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



శృంగవరపుకోట: ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను ప్రజాప్రతినిధులు, అధికారులు



గజపతినగరం: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక, అధికారులు

● అలరించిన రంగవల్లులు



గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్.కోట పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన రంగవల్లులు పోటీలు అలరించాయి. పలు పాఠశాలల విద్యార్థినులు హాజరై వేసిన ముగ్గులు అలరించాయి. అదే సమయంలో మహిళా సాధికారతపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ అధ్యాపకురాలు వై.విజయలక్ష్మి, ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యారావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు

– శృంగవరపుకోట

● అభినందన



రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన చీపురుపల్లి పట్టణంలో కరాటే అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులను, కరాటే మాస్టర్ శేఖర్‌ను జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు జెడ్పీటీసీ కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈనెల17న విజయవాడలోని పడమటలో గల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కుమిటి విభాగంలో వజీర్‌భాషా ప్రథమ స్థానం, నితీష్ ద్వితీయ స్థానంలో నిలిచారు. కాటా విభాగంలో ప్రశాంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు.

– చీపురుపల్లి

● పర్యావరణ హితం



ఎస్.కోట పట్టణంలోని వివేకానంద కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. కళాశాలలో కొత్తగా బాలికల ఎన్‌సీసీ బృందం ఏర్పాటైన నేపథ్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రకాల మొక్కలు నాటారు.

– శృంగవరపుకోట

● సామూహిక సీమంతాలు



సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా గజపతినగరంలోని సత్యసాయి బాబా మందిరంలో తొమ్మిది గర్భిణులకు సత్యసాయి భక్తులు మంగళవారం సామూహిక సీమంతం నిర్వహించారు. గర్భిణులకు చీరలు, పండ్లు, పూలు, మిఠాయిలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. అంతకుముందు నగర సంకీర్తన, సత్యసాయి మందిరంలో పూజలు, భజనలు చేశారు.

– గజపతినగరం

104 ఉద్యోగుల వినతి



విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గరివిడి మండల 104 ఉద్యోగులు ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోయారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని,104ను ప్రభుత్వమే నిర్వహించాలని, బీమా సదుపాయం కల్పించాలన్నా రు. తమ సమస్యలు పరిష్కరించేలా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అంతా కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కొత్తవలస: యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఎన్నికను స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల అధ్యక్షు లుగా సీహెచ్.నిర్మలాదేవి, గౌరవ అధ్యక్షుడిగా ఎన్.ఎస్.ప్రసాద్, సహధ్యక్షులుగా పి.కనకరత్నం, వి.సురేష్‌కు మార్, సీహెచ్.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.విజయగౌరి, కార్యదర్శులుగా ఎస్.నాయుడుబాబు, సీహెచ్.ఎస్.శ్రీనివాసరావు, టి.సూర్యప్రకాష్, వి.ఏ.ప్రసాద్, ఏ.జి.రామారావు, కె.శ్రీనివాసరావు, వై.పద్మావతి, టి.శ్రీదేవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా పి.సూరిఅప్పారావు, సీహెచ్.అప్పారావు, కె.రామకృష్ణారావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా టి.వినోద్‌కుమార్, పి.రమేష్, ఎస్.వాసు, వి.మురళీధర్, సీహెచ్. విజయబాపన్న, కె.బావునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గంట్యాడ: మండలంలోని మురపాక, రావివలస గ్రామాల్లో 50 మంది పేదలకు విజయనగరం మారుతీ స్వయం సహాయక సంఘం వారు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అతిథిగా హాజరైన వ్యాపార వేత్త ఆడారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు చేయూత ఇవ్వడం, సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. చంద్రశేఖర్, రామ్‌మోహన్ పాల్గొన్నారు.